క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

కొడంగల్ : పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. విద్యా సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులు ప్రైమరీ క్లాసులకు ప్రైమరీ విద్యార్థులు అప్పర్ క్లాసులకు అప్‌గ్రేడ్ అవుతారు. ఇందులో భాగంగా విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే డ్రెస్ కోడ్‌లో పాఠశాలకు వచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మక్సూద్ అలీ విద్యార్థులకు అప్‌గ్రేడ్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చారిత్రక ప్రదేశాల సందర్శన



ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద విద్యార్థులు, అధ్యాపకులు

తాండూరు టౌన్ : పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు విజ్ఞాన, విహార యాత్రలో భాగంగా ఉత్తర భారతదేశంలోని పలు ప్రదేశాలను సందర్శించారు. ఈ దర్భంగా కళాశాల కరస్పాండెంట్ మల్లేశ్ యాదవ్ మంగళవారం మాట్లాడుతూ.. విద్యార్థులకు తరగతి బోధనతో పాటు ప్రత్యక్ష వీక్షణం ద్వారా బోధన చేయాలన్నారు. పుస్తకాల్లో చదువుకున్న చరిత్రను ప్రత్యక్షంగా సందర్శించడం వల్ల అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన వస్తుందన్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది విజ్ఞాన, విహారయాత్రలో భాగంగా ఉత్తర భారతదేశంలోని అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్, వాఘా సరిహద్దు, ఢిల్లీలోని ఎర్రకోట, ఇండియా గేట్, కుతుబ్‌మినార్, అక్షరధామ్‌లతో పాటు కులుమనాలి వంటి ప్రాంతాలను సందర్శించినట్లు ఆయన తెలిపారు.

'అమ్మ ఆదర్శ కమిటీ'ల ఎన్నిక



కమిటీలను ఎన్నుకుంటున్న ఎంఈఓ

దోమ: విద్యాకమిటీల స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలను ఎంపిక చేయడం జరిగిందని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. మంగళవారం దోమ మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామంలో వీఓఏ అధ్యక్షురాలు అమృతమ్మను పాఠశాల చైర్మన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు, కన్వీనర్‌గా ఎంపిక చేయడం జరిగింది.

ఆచూకీ చెప్పండి



చికిత్స పొందుతున్న మహిళ

అనంతగిరి: వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ మహిళ అడ్మిట్ అయింది. పేరు సరోజా అని చెబుతుందని మిగతా వివరాలు ఏమి చెప్పడం లేదని వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపారు. కావున ఆమె గురించి తెలిసిన వారు ఎవరైనా ఉంటే వెంటనే 8712670030 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆమె వయస్సు 65 సంవత్సరాలు ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

తాండూరు రూరల్: మండలంలోని చెంగోల్ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి.. మంగళవారం దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. బుధ, గురువారాల్లో ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కల్యాణ మహోత్సవం కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

నందిగామ: నిబంధనలకు విరుద్ధంగా తరగతులను కొనసాగిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ, మండల కేంద్రాల్లో సెలవు దినాలలో తరగతులను కొనసాగిస్తున్న విద్యాసంస్థలపై నిఘా పెట్టి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా సంవత్సరం మొదలు కాకముందే ఫీజుల దోపిడీ ప్రారంభించారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే పలు విద్యాసంస్థలు అడ్మిషన్లు ప్రారంభించి డొనేషన్ల రూపంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

దాహమో రామచంద్ర!

జిల్లాలోని, పెద్దేముల్ మండలంలోని తండాలు, మారుమూల ప్రాంతాల్లో తాగేందుకు మంచినీరు అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎండలు మండుతుండటంతో జలాశయాల్లో నీటిమట్టాలు పడిపోవడం.. బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. మిషన్ భగీరథ నీరు అంతంత మాత్రమే సరఫరా అవుతుంది. బిందెడు నీళ్ల కోసం కిలో మీటర్లు నడిచి వెళ్లి తెచ్చువాలని దుస్థితి. గత పదేళ్లుగా మంచి నీటికి నానా ఇబ్బందులు పడుతున్నామని.. దాహమో రామచంద్ర అంటూ దేవుడిని వేడుకుంటున్నామని సిద్ధన్న మడుగుతండావాసులు వాపోతున్నారు.

- సిద్ధన్నమడుగుతండా గిరిజనుల మొర
- నాలుగు బిందెలు రావడం అతికష్టం
- పదేళ్ల నుంచి ఇదే తంతు
- ప్రత్యేకాధికారి జాడలేదు



మిషన్ భగీరథ పైపు నుంచి నీరు రావడం లేదని చూపిస్తున్న మహిళ



నీటి కోసం తండావాసుల పాట్లు

పెద్దేముల్: పాలకులు, ప్రభుత్వాలు మారిన తండాల్లో నీటి గోస తీరటం లేదు.. సుమారు పదేళ్ల నుంచి వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల సిద్ధన్నమడుగుతండా గిరిజనులు తాగునీరు అందక నానా ఇబ్బందులు గురువుతున్నారు. గతంలో కిలో మీటర్ల దూరం నుంచి ఎడ్లబండ్లపై నీరు తీసుకొచ్చేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాలకు మిషన్ భగీరథ నీరు వచ్చిన తండాలో పూర్తిస్థాయిలో నీరు అందక పలు వార్డుల ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఈ విషయం పాలకులకు, ప్రభుత్వ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తండావాసులు వాపోతున్నారు. సర్పంచుల స్థానంలో ఉన్న ప్రత్యేకాధికారులు జాడే కనిపించడం లేదు.. కార్యదర్శులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పెద్దేముల్ మండల సిద్ధన్నమడుగుతండా గతంలో తట్టెపల్లి అనుబంధ గ్రామం. కొత్తగా జరిగిన నూతన పంచాయతీల్లో సిద్ధన్నమడుగుతండా కొత్త పంచాయతీగా ఏర్పడింది. తండాలో మొత్తం ఆరు వార్డులు, సుమారు 800 మంది ఓటర్లు , 1500 మంది జనాభా ఉన్నారు. ఈ తండాలో వందకు వంద శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గత పదేళ్ల నుంచి ఈ తండావాసులు నీటి కోసం చేయని ప్రయత్నాలు లేవంటే అతిశయోక్తి కాదు. నీరు కావాలన్న కిలో మీటర్ల దూరం నుంచి ఎడ్లబండ్లు లేదా ట్రాక్టర్ల దార్వా తీసుకురావాల్సిన పరిస్థితి. మిషన్ భగీరథ నీరు రావడం ఎంతో మేలు అనుకున్నారు. కాని తండాల్లోని 1.2 వార్డుల్లో తాగునీరు సక్రమంగా రాక తండావాసులు నీళ్లో రామచంద్ర అంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు వార్డుల్లోని తండావాసులు నీరు పట్టుకోవడం పూర్తయిన తరువాత వారి ఇండ్ల వద్దకు వెళ్లి తీసుకోవలసి వస్తుందని, లేదా నాలుగు బిందెల నీరు కూడా రావడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు సరఫరా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా లాభం లేదు



తండాలు అంటే అధికారులకు అసలుకే పట్టదు. గ్రామంలో ప్రారంభోత్సవాలు ఉన్న సమయంలో తప్ప మిగతా సమయంలో అధికారులు కన్నెత్తి చూడారు. 1, 2 వార్డుల్లో తాగునీరు రావడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. వేసవి కాలం వస్తుందటే నీటిగోస. పాలకులు, మారిన, ప్రభుత్వాలు మారిన నీటి గోస తీరడం లేదు.

– ఏ. రవికుమార్, సిద్ధన్న మడుగుతండా

నాలుగు ఇళ్లు తిరుగుతున్నాం..



నాలుగు బిందెల నీళ్ల కోసం నాలుగు ఇండ్లు తిరగాల్సి వస్తుంది. ఉదయం – సాయంత్రం నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయాన్ని మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోరు. తండావాసులు అంటే అధికారులు చులకనగా చూస్తారు. మా గోడు ఎవరికి చెప్పిన లాభం లేదు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.

– రుక్కిబాయి, సిద్ధన్న మడుగుతండా

త్వరలో పరిష్కరిస్తాం



ఇళ్లకు మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇచ్చిన సమయంలో పైపుల నుంచి చెర్రలను తొలగించి నీటి కనెక్షన్ తీసుకున్నారు. దీంతో తండాల్లో కొన్ని వార్డులకు నీరు వస్తుంది. 1, 2 వార్డులకు నీరు సక్రమంగా రావడం లేదు. ఈ విషయాన్ని పలుమార్లు తండావాసులు తెలియచేశారు. త్వరలో నీటి సమస్యను పరిష్కరిస్తాం.

– అఖిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పెద్దేముల్ మండలం

వందశాతం పోలింగ్ జరిగేలా కృషి

ఆర్డీఓ శ్రీనివాస్ రావు

తాండూరు టౌన్ : లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ జరిగేలా చూడాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న సువిధ, సీవిజిల్, సురక్ష, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ .. ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు తరలింపులో ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. రూ. 50 వేల కంటే ఎక్కువ నగదుతో వెళ్తే తప్పకుండా అందుకు సంబంధించిన రశీదులు వెంట ఉండాలన్నారు. అక్రమ మద్యం, నగదు తరలింపును అరికట్టేందుకు నియోజకవర్గ పరిధిలో కొత్లాపూర్, మైల్వార్, నవాంధ్గి సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. నేడు, రేపు ఎన్నికల సిబ్బందికి స్థానిక ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్లు తారాసింగ్, కిషన్, వెంకటేశ్, మునీరుద్దీన్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

తాండూరు రూరల్: మండలంలోని గౌతపూర్ గ్రామంలో బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. సోమవారం గ్రామంలోని గౌడకులస్తులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచు రాజప్పగౌడ్ మాట్లాడుతూ.. అగ్రకుల పెత్తనాన్ని అణిచివేసేందుకు బహుజనులందరిని ఏకం చేసిన వ్యక్తి పాపన్నగౌడ్ అని కొనియాడారు. పాపన్నగౌడ్ ఆశయసాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంలింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ గౌడి వెంకటేశం,రిటైర్డ్ ఏఎస్ఐ వెంకటయ్యగౌడ్, మహేష్ గౌడ్, బాలయ్యగౌడ్ ,రాజుగౌడ్ ,మహేష్ గౌడ్, సురేష్‌గౌడ్, రమేష్, నవీన్, అంజయ్య, యాదయ్య, గోపాల్, గోవింద్‌లు ఉన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెండింగ్ బకాయిలు చెల్లించండి

దోమ: ఉపాధి కూలీలకు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం దోమ మండల అధ్యక్షుడు సత్యయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవితాపాన్ని భరిస్తూ ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలకు ప్రభుత్వం వారి పనికి తగ్గ వేతనాన్ని అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పది వారాల కూలీలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండలనాయకులు శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కూలీలకు మద్దతు తెలుపుతున్న నాయకులు

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అరవింద్‌రావు

పరిగి: మండుతున్న ఎండలు దృష్ట్యా భూగర్భజలాలు అడుగంటుతున్నాయి.. కావున గ్రామాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అరవింద్‌రావు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశపు హాల్లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొత్తం 21 అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే రెండు నెలల తాగునీటి సమస్యలు మరింత పెరిగే అవకాశాలు ఎక్కువ ఉన్నాయన్నారు. కావునా గ్రామాల్లోని పాడైన చేతి పంపులు, మోటార్లను బాగు చేసి ప్రజలకు నీటి సమస్యలు రాకుండా ముందస్తుగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఖుదావన్ పూర్ తదితర గ్రామాల్లో గత ఐదు సంవత్సరాలుగా తాగు నీటి సమస్యలు ఉన్నాయని ప్రతి సర్వసభ్య సమావేశంలో అధికారులకు సూచించిన పరిష్కరించడం లేదని ఎంపీటీసీ ఉమాదేవి సభ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు గ్రామాలకు సందర్శించి ఎప్పటికప్పుడు సమస్యలపై ఆరా తీసి ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నీటి తరలింపు

కుల్కచర్ల: గ్రామానికి తాగునీరు అందించే చెరువులో కొందరు వ్యక్తులు తమ అవసరాల కోసం బోర్లు వేసి పైపులైన్లు ద్వారా నీటిని తరలిస్తున్నారు. దీంతో రైతులు, పశుపక్షాదులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులో కొందరు చెరువులోని నీటి తరలిస్తున్నారు. రైతులకు వెళ్లాల్సిన సాగునీరు కొందరికే పరిమితమవుతున్న పరిస్థితి నెలకొంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో పైపులైన్‌లు వేసి ఆ నీటితో ఇసుక ఫిల్టర్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పాయిపల్లి చెరువులో ప్రైవేటు వ్యక్తులు వేసిన బోర్లు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



నీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

తాండూరు రూరల్: వేసవిలో తాగునీటి సమస్యలపై గ్రామాల్లో ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలని డీఎల్ పీఓ శంకర్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని గౌతపూర్ ,చెంగోల్ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శులు తెలుసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. మిషన్‌భగీరథ నీరు గ్రామంలో సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా శాఖ అధికారులు, ప్రత్యేకాధికారుల సమన్వయంతో తాగునీటి సమస్యకు చర్యలు చేపట్టాలని సూచించారు. గౌతపూర్‌లో ఎస్సీకాలనీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు మేరకు డీఎల్‌పీఓ పరిశీలించారు. పైప్‌లైన్ సరిగ్గా లేకపోవడంతో ఆ శాఖ ఏఈతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం జీపీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుమల తరహాలో ఉత్సవాలకు సన్నద్ధం



తిరుపతి నుంచి వచ్చిన అర్చకులు

కొడంగల్ : పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. ఆలయంలో మంగళవారం తిరుమంజన కార్యక్రమం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలు, కుంకుమ, పసుపు, చందనం, కర్పూరం, వటివేరు తదితర వాటితో ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను తిరుమల తరహాలో నిర్వహించడం ఇక్కడి ఆలయ ప్రత్యేకత. తిరుపతి నుంచి వచ్చిన బ్రాహ్మణోత్తములు వారం రోజుల పాటు ఆలయంలో నిత్య సేవలు, కైంకర్యాలు నిర్వహిస్తారు. భక్తుల ఇలవేల్పుగా నిలిచిన శ్రీవారి ఉత్సవాలను వేద పండితులైన బ్రాహ్మణులు తిరుమల తరహాలో ఇక్కడ నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. నిత్యం వాహన సేవలు, నిత్య కైంకర్యాలు, సుప్రభాతం, తోమాల సేవ, అలంకరణ తదితర కార్యక్రమాలను భక్తి పారవశ్యంతో నిర్వహిస్తారు.

కార్యక్రమ వివరాలు..

నేడు బుధవారం సేనాధిపతి ఉత్సవం, అంకురార్పన, 4వ తేదీన ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం, పెద్ద శేషవాహనం, 5న చిన్న శేషవాహనం, హంసవాహనం, 6న సింహవాహనం, వ్యాళి వాహనం, 7న కల్ప వృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 8న మోహినీ అవతార ఉత్సవం, అమావాస్య పూలంగీ సేవ, గరుడోత్సవం, లంకా దహనం, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శేష వస్త్రాలు సమర్పన, 9న హనుమంత వాహనం, వసంతోత్సవం, ఉగాది ఆస్థానం, గజవాహనం, 10న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 11న రథోత్సవం, అశ్వవాహనం, 12న పల్లకీ ఉత్సవం, చక్రస్నానం, ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ప్రతి రోజు మధ్యాహ్నం 3గంటలకు ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, సాయంత్రం 7గంటలకు ఊంజల్ సేవ, శ్రీబాలాజీ పాడుతా తీయగా కార్యక్రమం, రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు భజన కార్యక్రమాలు ఉంటాయి.



సుగంధ ద్రవ్యాలు తెస్తున్న ధర్మకర్తలు

దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్, గౌరవ వేతనం ప్రాతిపదికన వివిధ కేటగిరీల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపల్ కె.నాగమణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రొఫెసర్ 5, అసోసియేటెడ్ ప్రొఫెసర్ 11, అసిస్టెంట్ ప్రొఫెసర్ 6 పోస్టులు, అలాగే, గౌరవ వేతనం కింద సీనియర్ రెసిడెంట్ 21 ఖాళీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఏప్రిల్ 6 తేదీన ఉ.9 గంటలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాల్సిందిగా ఆమె తెలియజేశారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రం

దోమ: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని బొంపల్లి ఎంపీటీసీ రాములు అన్నారు. మంగళవారం దోమ మండలం బొంపల్లి గ్రామంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరి మతాలను వారు అనుసరిస్తూ అందరూ కలిసిమెలిసి ఉండాలన్నదే తమ అభిమతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుక్క పాష, మొయిన్‌పాష, షఫి, గౌస్, తహర్ పాష, సత్తార్ ఖాన్, రహీం, ఖలీల్ పాష, రియాజ్ ముక్తార్, స్థానికులు పాల్గొన్నారు.



విందులో పాల్గొన్న మైనార్టీ సోదరులు, ఎంపీటీసీ రాములు

మంచినీటిని పొదుపుగా వాడాలి




నాగవరంలో బోరును పరిశీలిస్తున్న అధికారులు

ఎంపీడీఓ రాములు

బంట్వారం: వేసవి కాలం దృష్ట్యా భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయి. కావున మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీఓ రాములు ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన ఎంపీఓ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ వేణుమాధవ్ కలిసి సల్బత్తాపూర్, నాగవరం తదితర గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మంచి నీటి సరఫరాపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే, మిషన్ భగీరథ మంచి నీటి సరఫరాపై ఆరా తీశారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఉంటే సత్వరమే సరి చేయిస్తామన్నారు. భగీరథ నీటి సరఫరాతో పాటు స్థానికంగా ఉండే బోర్‌వెల్స్ పనితీరు ఎలా ఉందని ఆయన అడిగి తెలుసుకున్నారు. డైరెక్ట్ పంపింగ్‌ల వద్ద నీటిని వృథా చేయవద్దన్నారు. మోటారు ఆన్ చేసి నీరు పట్టాక వెంటనే ఆఫ్ చేయాలన్నారు. పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లలో ఎప్పుడూ నీరు నింపి ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయని మరో రెండు మూడు నెలలు మంచి నీరును పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శులు మహేందర్, లక్ష్మి పాల్గొన్నారు.

లేఅవుట్ ధ్వంసంపై ఫిర్యాదు

చేవెళ్ల: బీడీఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు సంబంధించిన లేఅవుట్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు, ప్లాట్ల యజమానులు డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు మంగళవారం వారు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలోని సర్వే నంబర్లు 208 నుంచి 213 వరకు, 242, 243 సర్వే నంబర్లలో 18 ఎకరాల 38 గుంటల భూమిని 2011 సంవత్సరంలో బీడీఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో 2013వ సంవత్సరంలో హెచ్ఎండీఏ నుంచి అనుమతి పొంది లేఅవుట్ చేసినట్లు చెప్పారు. సర్వే నంబర్ 242 పార్ట్‌లోని మూడు ఎకరాల భూమి తనది అంటూ బీడీఎల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు సంబంధం లేని వ్యక్తులు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ఈనెల 1వ తేదీన తోట శ్రీనివాస్‌రెడ్డి అతని అనుచరులతో లేఅవుట్‌లో గల పార్కు స్థలం, డ్రైనేజీ పైపులు, ప్లాట్ చుట్టూ నిర్మించిన ప్రహరీ, బీటీరోడ్లను జేసీబీ సాయంతో ధ్వంసం చేసినట్లు చెప్పారు.



మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సభ్యులు